క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాలనుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లనుపర్యవేక్షించారు.

ఘనంగా స్త్రీల ఆదివారం



నక్కావారిపాలెం చర్చిలో స్త్రీలనుద్దేశించి మాట్లాడుతున్న భాను సురేఖ

మొగల్తూరు: స్థానిక పంచాయతీ నక్కావారి పాలెం క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఆదివారం స్త్రీల ఆరాధనా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్తమానికురాలు తోట భాను సురేఖ కిరణ్ మాట్లాడుతూ చిన్నారుల నుంచి పెద్దల వరకూ బైబిల్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆమెను సంఘస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ తలారి కొండయ్య మార్టిన్, సీఆర్ విల్లూరి లాజర్, ఆల్టర్‌నేటివ్ డెలిగేట్ కోనాల ప్రసాద్ పాల్గొన్నారు.

కళకళలాడిన బీచ్



బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండవేడిమి మొదలు కావడంతో సేదతీరేందుకు పర్యాటకులు తీరానికి చేరుకున్నారు. సముద్రస్నానం చేసి అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

గుండెపోటుతో బీఎస్‌ఎఫ్ ఎస్సై మృతి



సంపతరావు (54)

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకల కోడేరుకి చెందిన బీఎస్‌ఎఫ్ ఎస్సై చొప్పల సంపతరావు (54) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఇటీవలే న్యూఢిల్లీ బదిలీ అయినట్లు బంధువులు చెబుతున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంపతరావు మృతదేహాన్ని లంకల కోడేరులో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చొప్పల రజని, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి జోగయ్య తదితరులు సంపతరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

దేశాలమ్మకు కిలో వెండి సమర్పణ



దేశాలమ్మకు వెండిని సమర్పిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ అమ్మవారికి దాతలు కేజి వెండిని సమర్పించారు. కాకినాడకు చెంది బ్లూపార్ట్ హేచరీ అధినేత కటికి వెంకట్ కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయ అవసరాల నిమిత్తం ఆలయ కమిటీ సభ్యులకు వెండిని అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి భక్తులకు ఆశీర్వదించారు. మే5నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



దేవాని ముత్యాలమ్మ(103)

పెనుగొండ: సిద్ధాంతంలో శతాధిక వృద్ధురాలు దేవాని ముత్యాలమ్మ(103) ఆదివారం మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తేలు సంతానం. ఆరుగురు మనవలు, 11 మంది మనవరాళ్లు ఉన్నారు. ముత్యాలమ్మ గతంలో సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహించేదని గ్రామస్తులు చెబుతున్నారు. వయస్సురీత్యా వచ్చే అనారోగ్యంతో తుది శ్వాస వదిలారు.

వైభవంగా వాసవీ మాత జయంతి

పెనుగొండ: తొలి త్యాగశీలి, ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యక పరమేశ్వరి భక్తులు జై వాసవీ.. జైజై వాసవాంబయ నమః నామస్మరణతో ఆదివారం పెనుగొండ మార్మోగింది. వాసవీ మాత జయంతి సందర్భంగా పెనుగొండలోని మూల విరాట్ నగరేశ్వర మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం, వాసవీ శాంతి ధాం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 7 గంటల నుంచి పెనుగొండలో రామాలయం నుంచి ఆలయం వరకూ 102 కలశాలతో వాసవీ మాతను వెండి పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాతకు వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకంలు నిర్వహించారు. ఆలయ ప్రాంగాణంలో వాసవీ మాలధారులు గణపతిహోమం, వాసవీ హోమంలు నిర్వహించి ఇరుముడులు సమర్పించారు. వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో వెండిరథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు, ట్రస్టీలు, వాసవీ క్లబ్, వాసవీ యువజన సంఘ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వాసవీ శాంతిథాంలో మరకతశిల వాసవీ మాత విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

వాసవీ శాంతి థాంలో

అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందపురి స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు శిష్టా మణికంఠ మరకత వాసవీ మాతకు అభిషేకం నిర్వహించారు. భజనలు, దీపోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెనుగొండలో 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వెండి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కలశాలతో చిన్నారులు, భక్తులు



కలశాలతో వస్తున్న మహిళలకు హారతులతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

నేటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సౌజన్యంతో పట్టణంలోని బీఆర్‌ఎంవీ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 6,7,8,9 తరగతలు చదివే బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగబాబు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారువారి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ మావుళ్లమ్మ వారి జాతరమహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటుచేశారు. వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇంచార్జ్ గుణ్ణం నాగబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కర్నేని గౌరునాయుడు, ఆలయ కమిటీ అధ్యక్షులు శంకరాపు శ్రీను, యందం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆకట్టుకున్న రథోత్సవాలు





పెనుగొండలో వాసవీ మాత వెండి రథోత్సవం, సిద్ధాంతంలో ఏకరూపదుస్తుల్లో రథోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు



పాలకొల్లులో లక్ష మల్లెల పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: వాసవీకన్యకపరమేశ్వరి జయంత్యుత్సవాలు పెనుగొండ, ఆచంట మండలాల్లో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ మాత పుట్టినిల్లు పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోనూ పెనుగొండలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ గా నిర్వహించారు. పూజలు, అభిషేకాలు, హోమాలు, అనంతరం సాయంత్రం వెండి రథంపై మేళతాళాలు, బాణసంచా కాల్పులతో ఉత్సవం నిర్వహించారు.

సిద్ధాంతంలో

సిద్ధాంతంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు అభిషేకాలు నిర్వహించి, ఆర్యవైశ్య మహిళలు ఏకరూప దుస్తులు ధరించి భారీ సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని రథోత్సవం నిర్వహించారు.

ఆచంటలో

ఆచంట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆచంట ఆర్యవైశ్య సత్రంలో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు, అనంతరం కేరళ వాయిద్యాలు, మేళతాళాలతో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బంగారువారి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారి జయంతి సందర్భంగా నిట్టల కామేశ్వరరావు బ్రహ్మత్వంలో ఆర్యవైశ్య దంపతులు, ముత్తయిదువులు, కన్నె పిల్లలతో సామూహిక లక్ష మల్లెల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మామిడి బాబు, సెక్రటరీ రేపాక ప్రవీణ్‌భాను, బోగవిల్లి నాగభూషణం, మాటూరి నరసింహమూర్తి, చక్కా చిన్నగొల్లబాబు, కారుమూరి శ్రీరాములు, గమిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



హోమం సందర్భంగా పూర్ణాహుతి చేస్తున్న దృశ్యం



నూతనంగా ప్రతిష్ఠించిన మావుళ్లమ్మ విగ్రహం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట మూడవ వీధిలో మావుళ్లమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఈరంకి కాశీ బ్రహ్మత్వంలో నిర్వహిస్తున్న మావుళ్లమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారిని వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ముందుగా విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, మూలమంత్ర హోమాలు, శివ పార్వతుల శాంతి కల్యాణం, వేద ఆశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను గేదెల శ్రీనివాసరావు, మన్నెపూరి శ్రీనివాస్, రెడ్డి చిన్ని దంపతులు ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ రక్షణ మార్గంలో నడుచుకోవాలి

పోడూరు: ప్రతిఒక్కరూ రక్షణ మార్గంలో నడుచుకోవాలని ప్రముఖ క్రైస్తవ ప్రసంగికురాలు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి రెవ.బి.విమలా రెడ్డి పిలుపునిచ్చారు. ఆమె ఆదివారం ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలోని ఎలీమ్ చర్చి(భాస్కరరెడ్డి చర్చి)కి విచ్చేశారు. దేశం, రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎలీమ్ చర్చి నూతన భవనం నిర్మాణ పనులను విమలారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలీమ్ చర్చిని స్థాపించడంతో పాటు గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన దివంగత పాస్టర్ రెవ.భాస్కరరెడ్డి కృషిని కొనియాడారు. భాస్కరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన అల్లుడు, ప్రముఖ ప్రసంగీకులైన రెవ.టీఎస్‌ఆర్ ప్రసాదరెడ్డి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వహిస్తున్న దైవసేవ, సమాజానికి అందిస్తున్న సేవా కార్యక్రమాలను విమలారెడ్డి ప్రశంసించారు. మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్, రైతుసంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, వార్డు మెంబరు పుచ్చకాయల నాగార్జున తదితరులను ప్రసాదరెడ్డి విమలారెడ్డికి పరిచయం చేశారు. విమలారెడ్డి తొలిసారిగా గ్రామానికి విచ్చేయడంతో గ్రామ సర్పంచ్ సీతారాం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి రమేష్, యెల్లమెల్లి రాజేష్, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, షేక్ బాజ్జి, గన్నాబత్తుల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



రెవ.బి.విమలారెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

వార్షికోత్సవాలతో విద్యార్థుల్లో నూతనోత్సాహం



అబ్బిరాజుపాలెంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో నూతన ఉత్సాహం వస్తుందని అబ్బిరాజుపాలెం సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. సభలో సాయిబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, అలాంటి ప్రత్యేకత వార్షికోత్సవాల సమయంలో బయట పడుతుందన్నారు. ఇటువంటి వార్షికోత్సవాల నిర్వహణకు దాతలు కూడా ముందుకు వచ్చి సహాయం చేయడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా గతేడాది పాఠశాలలో చదివిన విద్యార్థులకు తరగతి వారీగా మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన వారికి దాతల సహకారంతో నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శిరిగినీడి లక్ష్మీ సునీత, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ముత్యాల స్వాతి, వైస్ చైర్మన్ యల్లమిల్లి శ్రీనివాస్ ఉప సర్పంచ్ కడలి ఏసుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుత్తిందీవి శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు పోలిశెట్టి క్రాంతికుమార్, ఈద దైవ వర ప్రసాద్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రామేశ్వరపు సత్యనారాయణ టీచర్ జక్కంశెట్టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలు రైతులకు అండగా నిలవాలి

వీరవాసరం: సొసైటీ పాలకవర్గాలు రైతులకు అండగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు(బాబు) అన్నారు. రాయకుదురులో కో-ఆపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కటికరెడ్డి రాంబాబు సభ్యులుగా గుడాల రవి కుమార్, బొడ్డుపల్లి మార్తమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన త్రిసభ్య కమిటీని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందించారు.

టైలరింగ్‌తో మంచి ఉపాధి అవకాశాలు



టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందిస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పోడూరు: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు టైలరింగ్ మంచి ఉపాధి అని వసు ధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధ రాజు అన్నారు. వసు ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్ముచిక్కాల గ్రామంలో మహిళలకు ఉచితంగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు సందర్శించి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 35 మంది మహిళలకు 75 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణనిచ్చినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలు మాట్లాడుతూ టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణనివ్వడంతో తమకు జీవనాధారం దొరికిందని సంతోషం వ్యక్తం చేస్తూ వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ సభ్యులు వేగేశ్న తాతరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువ కావడం కోసమే మన్ కీ బాత్

పాలకొల్లు సెంట్రల్: ప్రజలకు చేరువ అవ్వాలనే ఉద్దేశంతోనే దేశ ప్రధాని నరేంద్ర మోది మన్ కీబాత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని శక్తి కేంద్ర ఇన్‌చార్జ్, బీజేపీ సీనియర్ నాయకులు రావూరి సుధ అన్నారు. ఆదివారం మన్‌కి బాత్ కార్యక్రమంలో భాగంగా 83, 84, 85 పోలింగ్ బూత్‌లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలు పాటుపడుతున్న వ్యక్తి మోది అని అన్నారు. మన్ కీ బాత్ ప్రసంగాలతో ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాళం బాబి, పలివెల భాస్కర్, వెంకటేష్ వడయార్, మల్లపోలు సురేష్, పోకల బాబి, వేరుకొండ దుర్గాప్రసాద్, కూనపరెడ్డి సుధీర్ పాల్గొన్నారు.

వడలిలో..

పెనుగొండ: ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మన్ కీ బాత్‌తో ప్రజలను కార్యోన్ముఖులను చేస్తున్నారని బీజేపీ మండల ఇన్‌చార్జి దొడ్డిపట్ల నాగూర్ అన్నారు. ఆదివారం మన్ కీ బాత్ 00వ కార్యక్రమాన్ని వడలిలో గంటా నాగేశ్వరరావు నివాసంలో బీజేపీ నాయకులు వీక్షించారు. అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో వి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, డి.మోహనకృష్ణ, ఇ.రామకృష్ణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని పేర్కొన్నాయి. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించాయి.

ధాన్యం ట్రక్కు బోల్తా

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. అజ్జమూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వేబ్రిడ్జి వేయించుకుని, తిరిగి ఆకివీడులోని రైస్‌మిల్లుకు ధాన్యాన్ని చేరవేసే క్రమంలో వంతెన ఎక్కుతూ ట్రక్కు తిరగబడింది. మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన రైతుకు ఆకివీడులోని రైస్ మిల్లు కేటాయించడంతో ధాన్యం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదం నుంచి ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు.